


# నవభూమి

## జిల్లా అనుబంధం

31 జులై,2025 గురువారం పేజీలు:10

www.epaper.navabhoomi.in




# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మహిళల పేరిట సంక్షేమ పథకాలు అమలు
- నేలకొండపల్లి డిగ్రీ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్ని మొక్కలు నాటి, మార్కెట్ యార్డులో మండల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేసిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం నవభూమి బ్యూరో, జూలై 30:** కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నదని, మహిళల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు లతో కలిసి బుధవారం నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్ని మొక్కలు నాటారు. అనంతరం నేలకొండపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణ లో మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదల కష్టాలు చూసిన ప్రభుత్వం వారికి భరోసా కల్పించే విధంగా పాలన కొనసాగిస్తున్నదని అన్నారు. ప్రతి రోజు పేదల ముఖంలో చిరునవ్వు ఉండేలా తెలంగాణ రాష్ట్రంలో పాలన సాగుతోందని అన్నారు. ప్రతి ఇంటికి మహిళలు మహాలక్ష్మి లుగా ఎన్ని కష్టాలు వచ్చినా ఇండ్లను ఉన్నత స్థాయికి తీసుకొని వెళ్తారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని, ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరిట ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. గతంలో దివంగత నేత వైఎస్సార్ హయాంలో లక్ష మంది మహిళలను లక్షాధికారులు చేస్తామనీ మాట ఉండేదని, ప్రస్తుతం కోటి మంది మహిళలను



కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోయిన ఆర్థిక సంవత్సరంలో సున్నా వడ్డీతో 25 వేల కోట్ల రూపాయలు 65 లక్షల మంది మహిళ సంఘాల మహిళలకు అందించామని అన్నారు. గడిచిన 4 నెలల్లో మహిళలకు ప్రజా ప్రభుత్వం సున్నా వడ్డీ క్రింద 855 కోట్లు మహిళా సంఘాలకు విడుదల చేశామని అన్నారు. ప్రతి నియోజక వర్గంలో మహిళ శక్తి సంబరాలు నిర్వహిస్తూ సున్నా వడ్డీ సొమ్ము చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాల్లో చేరే వయస్సును కనీస వయస్సు 15 సంవత్సరాలు గరిష్ట వయస్సు 65 సంవత్సరాలకు సవరించామని అన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు, పెట్రోల్ బంక్, రైస్ మిల్ వంటి వ్యాపారాలలో అవకాశం కల్పిస్తున్నా మని, రైతులు పండించే ధాన్యం కొనుగోలు బాధ్యతలు కూడా మహిళా సంఘాలకు అప్పగించామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యత కూడా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించా మని మంత్రి తెలిపారు. గత పాలకులు పేద కుటుంబానికి రేషన్ కార్డు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి విమర్శించారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ కొనసాగుతుందని, అర్హులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి రేషన్ కార్డు జారీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఉగాది నుంచి రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, మూడు నెలలకు సంబంధించిన రేషన్ ఒకేసారి పంపిణీ చేశామని అన్నారు. గత పాలకులు 10 ఏళ్ళలో రైతులకు 17 వేల కోట్ల రుణ మాఫీ చేస్తే ప్రజా



ప్రభుత్వం ఏడాది కాలంలోనే దాదాపు 21 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన పేదలందరికీ దశలవారీగా తప్పనిసరిగా అందించే బాధ్యత తనపై ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం నూతనంగా రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందని, మన ఖమ్మం జిల్లాలో 19 వేల 690, పాలేరు నియోజకవర్గంలో 4 వేల 225 నూతనంగా పేదల కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అదే విధంగా ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో 62 వేల కొత్త సభ్యులను నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి పేదవాడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ ద్వారా సరఫరా చేస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుతో బియ్యం మాత్రమే కాకుండా ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ కార్యక్రమాలు కూడా అమలు అవుతాయని అన్నారు. రేషన్ కార్డులు పంపిణీ నిరంతర ప్రక్రియ కొనసాగుతుందని, అర్హులు ఎవరైనా ఉంటే తహసిల్దార్ కార్యాలయం లేదా మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతి పథకాన్ని మహిళల పేరిట అమలు చేస్తుందని, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం మహిళలకు అందించడం ద్వారా పేద కుటుంబాలు బాగు పడుతున్నాయని అన్నారు.



# అభివృద్ధి పనుల భూ సేకరణ స్పీడ్ అప్ చేయాలి



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు కేటాయించే లే- ఔట్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
- రోప్ వే నిర్మాణానికి అవసరమైన స్థలం పర్యాటక శాఖకు బదిలీ చేయాలి
- కలెక్టరేట్‌లో మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారులు, ఖమ్మం ఖిల్లా రోప్ వే వంటి అభివృద్ధి పనుల భూసేకరణ అంశాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం నవభూమి బ్యూరో, జూలై 30:** జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణ స్పీడ్ అప్ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారులు, ఖమ్మం ఖిల్లా రోప్ వే వంటి అభివృద్ధి పనుల భూ సేకరణ అంశాలపై బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, అవసరమైన భూ సేకరణ తదితర అంశాలను అధికారులు వివరించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ వర్కింగ్ మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లో రైతులు అంగీకరించిన స్థలం, ప్రభుత్వ పట్టా భూముల్లో పనులు వేగవంతం చేయాలని అన్నారు. రైతుల పొలాలకు ప్రత్యామ్నాయంగా ప్లాట్ లను కేటాయిస్తున్నామని అన్నారు. రైతులకు అందించే లేఔట్ ప్లాట్ లలో అంతర్గత రోడ్లు, స్ట్రీట్ లైట్ , విద్యుత్ సరఫరా పనులు వేగవంతం చేయాలని అన్నారు. రైతులకు లేఔట్ లో జరిగే అభివృద్ధి పనులు చూపించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు స్వచ్ఛందంగా అప్పగించేలా కృషి చేయాలని అన్నారు. లేఔట్ లో 10 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం పనులకు డిజైన్ ఫైనల్ చేయాలని అన్నారు. హైదరాబాద్ లోని ప్రైవేట్



లేఔట్ తరహాలో మన లేఔట్ అభివృద్ధి చేయాలని, ఈ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో స్పష్టమైన గడువు నిర్దేశించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం రోప్ వే నిర్మాణానికి అవసరమైన స్థలం సేకరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. లబ్దిదారులకు ప్రత్యామ్నాయంగా వైద్య కళాశాల సమీపంలో ప్లాట్ లను ఇస్తున్నామని, అక్కడే హై వే కూడా వస్తుందని, మంత్రి చేతుల మీదుగా పట్టాల పంపిణీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. పట్టాల పంపిణీ తరువాత వెంటనే పర్యాటక శాఖకు స్థలం బదలాయించాలని అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం అవసరమైన భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జాతీయ రహదారుల ఎంట్రీ, ఎగ్జిట్, సర్వీస్ రోడ్ల నిర్మాణం జరగాలని అన్నారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, నేషనల్ హైవే మేనేజర్ దివ్య, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి: ఎస్పి రోహిత్ రాజు



**కొత్తగూడెం జులై 30 నవభూమి ప్రతినిధి:** ఎస్పీ రోహిత్ రాజు సుజాత నగర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ అధికారులకు సిబ్బందికి సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్ఐ ఉమ,సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో ఆర్టిఐ అమలుపై రాష్ట్ర కమిషనర్ల పర్యటన, కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం జులై 30 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్య రెడ్డి జిల్లా పర్యటన చేయనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా,నేడు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు అన్ని శాఖల ప్రజా సమాచార అధికారులు అప్పిలేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడుతుందని, మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు అప్పీలు దారుల తో విచారణ కలెక్టర్ పేర్కొన్నారు. ఆగస్టు 1 ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు మరో విడత ఆర్టీఐ అప్పీల్ విచారణలు జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించబడతాయని వివరించారు. ఈ సందర్భంగా, అన్ని శాఖల పి ఐ ఓ లు మరియు అప్పిలేట్ అధికారులు 6(1) కింద దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుల రసీదులు, ప్రశ్నలు, సమాధానాలు, అవసరమైన పాయింట్‌వారీ కౌంటర్ సమాచారంతో విచారణలకు తప్పకుండా హాజరుకావలసినదిగా కలెక్టర్ ఆదేశించారు. అన్ని విభాగాల పి ఐ ఓలు,ఏ ఏ లు ఇంటరాక్షన్ సెషన్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకత పెంపొందించడంలో భాగంగా, ప్రతి కార్యాలయంలో ఆర్టీఐ బోర్డులను మార్గదర్శకాల ప్రకారం నవీకరించి, ప్రదర్శించాలనీ, ఇందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు

# పట్టుదలకు కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువులో రాణించాను
- సమర్థవంతంగా విధుల నిర్వహణకు క్షేత్రస్థాయి అనుభవం దోహదపడుతుంది
- 2024 ఐఏఎస్ బ్యాచ్‌లో 11వ ర్యాంక్ సాధించిన సాయిశివాని అభినందించిన కలెక్టర్





**ఖమ్మం నవభూమి బ్యూరో, జూలై 30:** మనలో ఉన్న పట్టుదలకు, కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం అవుతాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. 2024 ఐఏఎస్ బ్యాచ్ లో 11వ ర్యాంక్ సాధించిన తెలంగాణ, వరంగల్ కు చెందిన ఇ. రాజు, రజిత దంపతుల కుమార్తె ఇ. సాయి శివాని తల్లిదండ్రులతో కలిసి బుధవారం ఖమ్మం కలెక్టరేట్, కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్, సాయి శివాని, ఆమె తల్లిదండ్రులకు శాలువా కప్పి కలెక్టర్ సన్మానించి అభినందనలు తెలిపారు. ఐఏఎస్ బాధ్యతలు, ట్రైనింగ్, పరిపాలన విధులు ఏ విధంగా ఉంటాయో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆమెకు వివరించారు. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నప్పుడే ప్రభుత్వ అధికారి, తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని అన్నారు. అధికారులు ప్రజలకు సేవలు అందించడానికి ఎంతో అవకాశమున్నదని, నేనేం చేస్తున్నాను, సమాజం నా నుండి ఏం ఆశిస్తున్నది, నా పరిధిలో ఏం చేయగలను అన్నది ఆలోచించాలన్నారు. ప్రజలు ప్రశ్నిస్తున్నారని, ప్రజలకు జవాబుదారీగా ఉన్నప్పుడే విధుల నిర్వహణ చేయగలమని, వృత్తికి న్యాయం చేయగలమని కలెక్టర్ తెలిపారు. ప్రజల్లో నమ్మకాన్ని ఎప్పుడు కోల్పోవద్దని ఆయన సూచించారు. మనం చేసే పనిలో అనేక ఇబ్బందులు, కష్టాలు వస్తాయని వాటిని తట్టుకుని మళ్ళీ నిలబడాలి అని అన్నారు. సమాజంలో మనకు అనేక మంది స్ఫూర్తిని ఇచ్చేవారు ఉన్నారని, మనల్ని కష్టపడి చదువించిన తల్లిదండ్రులు మనకు స్ఫూర్తిగా ఉంటారని అన్నారు. చిన్నతనంలో తాను సాధారణ విద్యార్థి మాత్రమేనని, జీవితంలో ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఐఏఎస్ ఫస్ట్ ర్యాంక్ పాస్ అయ్యానని అన్నారు. మనకు ఉన్న సామర్థ్యంతో పాటు సరైన సమయంలో కష్టపడి పని చేయడం చాలా అవసరమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు

# ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రభుత్వ వైద్యుల హాజరు సక్రమంగా ఉండాలి
- ఆధార్ బేస్ హాజరులో ప్రభుత్వ వైద్యులు నమోదు అవ్వాలి
- అందుబాటులో ఉన్న ప్రతి మెషినరీ సద్వినియోగం చేసుకోవాలి
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులతో సమీక్ష చేపట్టిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం నవభూమి బ్యూరో, జూలై30:** మెరుగైన సేవలతో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులతో ఆసుపత్రుల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. జిల్లాలో 4 ఏరియా ఆసుపత్రులు, 3 సామాజిక ఆరోగ్య కేంద్రాలు వైద్య విధాన పరిషత్ ద్వారా నిర్వహింప బడుతున్నాయన్నారు. సత్తుపల్లి, మధిర, కల్లూరు ఏరియా ఆసుపత్రుల నూతన భవనాల నిర్మాణం పూర్తయి, ప్రారంభానికి సిద్ధం అయ్యాయన్నారు. ప్రారంభానికి ముందే త్రాగునీరు, పవర్ సప్లయి, టాయిలెట్స్ తదితర మౌళిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండేట్లు, చిన్న చిన్న పనులు మిగులు ఉంటే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. త్రాగునీటికి మిషన్ భగీరథ ద్వారా ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్యుల హాజరు సక్రమంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో వైద్యులందరూ ఆధార్ ఆధారిత హాజరు యాప్ లో నమోదు అవ్వాలని అన్నారు. అనుమతి, సమాచారం లేని గైర్హాజరు అవరాదని, క్షేత్ర స్థాయిలో వెళ్ళవలసి వస్తే, హాజరు నమోదు పిదప వెళ్లాలని అన్నారు. ప్రతిరోజూ హాజరు నివేదిక సమర్పించాలని కలెక్టర్ అన్నారు. అందుబాటులో ఉన్న పరికరాల ఆడిట్ చేయాలని, మరమ్మత్తులో ఉన్న పరికరాల వివరాలు దృష్టికి తేవాలని, ప్రతి పరికరం పనిచేసే విధంగా మరమ్మతులు పూర్తిచేసుకుని, సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. అవసరమైన మందులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఏవైనా మందులు అందుబాటులో లేక,సరఫరా లేకుండా ఉన్నట్లయితే, స్థానికంగా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, బయటి మందులు రోగులకు రాయకూడదని అన్నారు. పరీక్షలు టి హబ్ కు పంపేవి కాకుండా, ఆసుపత్రుల్లో కిట్లు ఉన్నవి అక్కడే చేయాలని కలెక్టర్ తెలిపారు. టెస్టింగ్ పరికరాలు కావాల్సినవి అందుబాటులోకి తెస్తామన్నారు. మేజర్ ఆపరేషన్లు చేపట్టాలన్నారు. బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ యూనిట్, మార్చురీ ల ఏర్పాటుకు అవసరమైన చోట ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వ వైద్యులు సేవాదృక్పథంతో పనిచేయాలని, తమ వైఖరి మార్చుకోవాలని కలెక్టర్ అన్నారు. ఒక్కొక్కటిగా గ్యాప్ లన్ని పూరిస్తామన్నారు. ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని మంచి ఫలితాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఆసుపత్రుల సూపరింటెండెంట్ లు, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చితార్థ వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



**ఖమ్మంనగరం, నవభూమి, జూలై 30:** దేవభక్తుని రవికుమార్ అనురాధ దంపతుల కుమారుడు సాయి కుమార్ నిశ్చితార్థ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కట్టా అజయ్ కుమార్, ముత్యాల వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 5న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా


### ఉపాధ్యాయుల హక్కులసాధన కోసం ఆందోళనలే శరణ్యం, టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు



**ఆళ్ళపల్లి జులై 30 నవభూమి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలో విలేకరులతో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటి (యు ఎస్ పి సి) ఆధ్వర్యంలో ఆగస్టు 5న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విద్యారంగం సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, పిఆర్సి ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డిఏ లు వెంటనే చెల్లించాలి. సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయాలి. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులందరిని వారి వారి సొంత జిల్లాలకు పంపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను సవరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలన్నారు. టైం స్కేల్ ఇవ్వాలని, వివిధ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్,పార్ట్ టైం అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు కనీసం వేతనం ఇవ్వాలని, నూతన జిల్లాలకు డిఈఓ పోస్టులను. ప్రతి రెవిన్యూ డివిజన్ కు డిప్యూటీ ఈవో, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అనుమానాస్పద స్థితిలో మున్సిపల్ కాంట్రాక్టర్ మృతి

**పాల్వంచ జులై 30 నవభూమి ప్రతినిది:** పాల్వంచ పట్టణ పరిధిలోని విద్యుత్ ఎంప్లాయిస్ కాలనీ లోగల వాకింగ్ ప్రదేశంలో కాంట్రాక్టర్ సుధాకర్ బుధవారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఉదయం వాకింగ్ కు వెళ్లిన కొంతమంది అచేతనంగా పడి ఉన్న సుధాకర్ ను చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.





# పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలి

### ■ కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ చేయాలి



**తిరుమలాయపాలెం నవభూమి జూలై 30 –** పంచాయతీ క కార్మికులకు కనీస వేతనం 26,000 చెల్లించాలని కాంట్రాక్టు కార్మికులు రెగ్యులేషన్ చేయాలని 9 వేల పెన్షన్ పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ బుధవారం తిరుమలాయపాలెం ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ కు వినతి పత్రం పత్రం అందజేశారు ఈ సందర్భంగా టియుసిఐ పాలేరు ఏరియా ఉపాధ్యక్షులు మేగడి సైదులు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మిక వర్గ పరిస్థితి దిగజారే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు వేతనాలను ధరల పెరుగుదలతో సమానంగా పెంచలేదు కార్మిక సంఘాలతో చర్చలు జరపకుండా అప్రజాస్వామ్య పాలన కొనసాగించింది, కార్మిక డిమాండ్స్ ను ఖతార్ చేయలేదు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ టైం స్కేల్ విధానాన్ని తీవ్రంగా దుయ్యపట్టి రెగ్యులరైజ్ చేస్తామన్న హామీ నెరవేర్చలేదు. ప్రభుత్వం కార్మికులను ఉద్యోగులను అన్యాయం చేసిందంటూ గగ్గోలు పెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కార్మికులకు అనేక హామీలను ఇచ్చింది ప్రభుత్వ సంస్థల్లో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్స్ ఉద్యోగులను కార్పొరేషన్ కిందకు వేతనాల పెంపుదల చేస్తామని తీసుకువచ్చి వేతనాల కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికుల సమస్యల పట్ల జూలై 31న జరిగే జిల్లా కేంద్రంలో జరిగే ప్రదర్శనలో కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ధర్నాను నిర్వహించాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా( %ఖజ×% ) మండల నాయకులు డి వెంకన్న, ఎన్ బాబు, బిక్షం, రమేషు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్ల వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని విద్యార్థి లోకానికి తెలియజేయండి

### ■ బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సంకుబాపన అనుదీప్




**కొత్తగూడెం జులై 30 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం కొత్తగూడెం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్నటువంటి అన్యాయాన్ని విద్యార్థి లోకానికి తెలియజేసి పోరాటం చేయడం కోసం కార్యచరణ మరియు జిల్లాలోని అన్ని కళాశాలలో బి ఆర్ ఎస్ విద్యార్థి విభాగం కమిటీలు ఏర్పాటు తదితర అంశాల ఎజెండాతో సమావేశం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు అనుదీప్ మాట్లాడుతూ విద్యార్థి విభాగం నాయకులకు పలు సలహాలు సూచనలు చేసి విద్యార్థుల సమస్యలు మరియు ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అలాగే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అవసరమైతే ఉద్యమాలు చేయాలని పార్టీని బలంగా ప్రజల వద్దకు తీసుకెళ్లాలని అన్నారు మరియు కార్యక్రమంలో భాగంగా బి ఆర్ ఎస్వి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. ఎన్.రాజు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పనిచేయాలని బనకచర్ల తదితర అంశాలపై సూచనలు చేశారు.అనంతరం విద్యార్థి విభాగం నియోజకవర్గ పట్టణ కమిటీల నాయకులు వారి ఎజెండాలు కార్యచరణ సూచనలు సలహాలు చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో వెంపటి భరత్, బత్తుల మధు చంద్, బావు సతీష్ యాదవ్, జూపల్లి దుర్గాప్రసాద్, హరి ప్రసాద్ యాదవ్, యువరాజ్ ,సురేష్ నాయక్, బాదావత్ శ్రీకాంత్ నాయర్, గూడెల్లి ముఖేష్, కంచర్ల రామారావు, అఖిల్ మహర్షి, రవితేజ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# 42 శాతం రిజర్వేషన్ సాధించేవరకు బీసీల ఐక్యమత్యంతో ముందుకు సాగాలి

### ■ రెండు జాతీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయి

### ■ వనమా రాఘవ



**కొత్తగూడెం జులై 30 నవభూమి ప్రతినిధి:** 42 శాతం రిజర్వేషన్ సాధించేవరకు బీసీల ఐక్యమత్యంతో ముందుకు సాగాలని,రెండు జాతీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని బి ఆర్ ఎస్ నాయకులు వనమా రాఘవేందర్ రావు అన్నారు. బీసీలను ఓట్ల కోసమే చూడకండి రాజ్యాంగబద్ధంగా మాకు రావాల్సిన పదవులను మాకు ఇవ్వాలని సూపర్ బజారు సెంటర్ లో బుధవారం జరిగిన నిరాహారదీక్ష శిభిరం లో అయన మాట్లాడారు బీసీలకు, సబ్బండ వర్గాలకు న్యాయం చేసిన నాయకుడు కేసీఆర్ ఒకరే అన్నారు. బీసీలకు న్యాయం జరగకపోతే బీసీల తడాఖా ఏంటో చూపెడతామని హెచ్చరించారు. ఈ యొక్క కార్యక్రమంలో బహుజన సంఘం నాయకులు భూపతి శీను, తాండ్ర వెంకటేశ్వర్లు, కొదమూరు సత్యనారాయణ, మల్లయ్య, మల్లెల రామనాథం, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, మాజీ కౌన్సిలర్లు రుక్మందర్ బండారి, అంబుల వేణు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మాజీ ఉర్దూగర్ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆరిఫ్ ఖాన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాండ్ర నాగబాబు, గౌస్, మల్లలా శ్రీరామ్ మూర్తి, సత్యనారాయణ (సంపు), నవతన్, బొమ్మిడి రమాకాంత్, బొందుగుల శ్రీధర్, పిల్లి కుమార్, నిజాం, వినోద్, కరాటే శీను, నరేందర్, హబీబ్, తెలంగాణ సురేష్,ఎం. ఏ. మజీద్,ఆవునూరి చంద్రయ్య, హైమత్, బీ శ్రీనివాస్, బీసీ, మరియు ఎస్ టి, ఎస్ సి సంఘాల నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృత్రిమ కాలు అందించిన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్



**కొత్తగూడెం జులై 30 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన ట్రాన్ జెండర్ ప్రమాదవశాత్తు కాలు కోల్పోయి నడవలేని స్థితిలో ఉన్న విషయాన్ని స్థానిక నాయకులు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ దృష్టికి తీసుకురావడంతో 5లక్షల 50 వేల రూపాయల విలువైన జర్మన్ టెక్నాలజీతో నడవడానికి అనుకూలంగా ఉండే కృత్రిమ కాలును వారికి విద్యానగర్‌లోని రెవిన్యూ మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కసనబోయిన రామ్మూర్తి, కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షులు పాల సత్యనారాయణ రెడ్డి, సుజాతనగర్ మండల అధ్యక్షులు వాంకుడోత్ శ్రీకాంత్, పాల్గొన్నారు

## పేదవర్గాలకు ఎర్రజెండానే అండా

### సేవల ఫలితంగానే సిపిఐకి జనాదరణ

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

### 30 మంది సిపిఐలో చేరిక



**కొత్తగూడెం జులై 30 నవభూమి ప్రతినిధి:** పేదవర్గాలకు ఎర్ర జెండానే భరోసా అని, వారికి ఏ కష్టమొచ్చినా ఆదుకునేది సిపిఐనేనని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని గాజులరాజం బస్తి, లక్ష్మీదేవిపల్లికి చెందిన 30 మంది యువకులు బుధవారం సాబీర్ పాషా సమక్షంలో సిపిఐలో చేరారు. దీటి రాజా శ్రీనివాస్, మోడెం మోహన్ రావు, ఎండి అబ్దుల్ రహమాన్, హేమంత్ తదితరుల నాయకత్వంలో పార్టీలో చేరిన యువకులకు ఎర్ర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసేది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలేనన్నారు. ప్రజలకు అందిస్తున్న సేవల ఫలితంగానే కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐకి రోజురోజుకు జనాదరణ పెరుగుతోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని కృషితో నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందని, ప్రజలకు కావాల్సిన మౌలిక అవసరాలను గుర్తించి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, పట్టణ నాయకులు ఎండి యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, బత్తుల సురేష్, గడ్డం ప్రభాకర్, గడ్డం సతీష్ బాబు, పల్నాటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల సమీపంలోని గ్యాస్ గోదాం తరలించాలంటూ ఆదేశం

**హైదరాబాద్, నవభూమి ప్రతినిధి జులై 30:** భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల నివాస ప్రాంతానికి అత్యంత సమీపంలో ఉన్న గ్యాస్ గోదాం వల్ల ముప్పును గురించి ఫిర్యాదు .1224/2022) పై స్పందించిన తెలంగాణ మానవ హక్కుల కమిషన్. జిల్లా కలెక్టర్‌కు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. గౌరవ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్, ఈ విషయమై 14.07.2025న ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలూ, నివాస ప్రాంతాల మధ్య ఇటువంటి ప్రమాదకర గోడౌన్ల నిర్వహణ ప్రజల జీవించే హక్కును (ఆర్టికల్ 21) ఉల్లంఘించడమేనని కమిషన్ పేర్కొంది. ఇలాంటి ప్రాంతాల్లో ప్రమాదకర పదార్థాల నిల్వ ప్రజల ప్రాణభద్రతకు ముప్పుగా నిలుస్తుందని స్పష్టం చేసింది.

# పర్యావరణాన్ని కాపాడుకుందాం

- మోడ్రన్ ఇఖ్రా పాఠశాలలో కోటి మొక్కల నాటే ప్రక్రియని ప్రారంభించిన
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా









**కొత్తగూడెం జులై 30 నవభూమి ప్రతినిధి:** పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందుకు మొక్కలు విరివిగా నాటడం వల్ల ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవచ్చని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని ఎస్ సి బి నగర్ మోడ్రన్ ఇఖ్రా పాఠశాలలో చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంస్థ చేపట్టిన మిలియన్మొక్కల పంపిణి కార్యక్రమాన్ని బుధవారం సాబీర్ పాషా ప్రారంభించి మాట్లాడారు. వాతావరణంలో వస్తున్న పెను మార్పులకు కారణం సమతుల్యత లోపించడమే నన్నారు. జీవకోటి మనుగడకు మొక్కలు ప్రధానమని ప్రతి ఒక్కరు మొక్కలను నాటడంతోపాటు పరిరక్షించాలని సూచించారు. చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంస్థ మిలియన్ మొక్కలు పంపేందుకు, నాటేందుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఈ సంస్థను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రగిరి శ్రీనివాసరావు, ఎస్ కె ఫహీమ్, ప్రిన్సిపాల్ బాసిత్, మొక్కల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్







**పాల్వంచ జులై 30 నవభూమి ప్రతినిది:** పాల్వంచ మండలం తోగ్గూడెం లోని మిషన్ భగీరథ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించి ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాంట్ లో గ్రిడ్ నుండి నీటి ప్రవాహం, నీటి నిల్వ సామర్థ్యం, రోజువారి మండల డిమాండ్, గ్రామాల వారిగా నీటి సరఫరా స్థితిగతులను తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్లో వివిధ దశల్లో అమలవుతున్న నీటి శుద్ధి ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ప్రతి దశలో చేపడుతున్న పరీక్షలు, శుద్దీకరణ పద్ధతులు, ల్యాబ్ పరీక్షల ప్రమాణాలను గురించి అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నిర్వహణలో ఉన్న సాంకేతిక పరికరాలు, ఫిల్టర్ల పనితీరు, కెమికల్ డోసింగ్ గురించి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి కాలుష్యం పెరుగుతుందని దానికి అనుగుణంగా, నీటి శుద్ధి పరీక్షలు నిర్వహించి పరిశుభ్రమైన నీరు సరఫరా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. వాటర్ ఫిల్టర్ బెడ్ భవనం పైన సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వాటర్ ప్లాంట్ ఆవరణంలో ఖాళీ ప్రదేశం అధికంగా ఉన్నందువలన ఆదాయాన్ని చేకూర్చే మొక్కలను నాటాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నలిని, పాల్వంచ తాసిల్దార్ ధారా ప్రసాద్, మిషన్ భగీరథ గ్రిడ్ డి ఈ సాయి, ఏఈ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దైవ దర్శనానికి వచ్చి తిరిగిరాని లోకానికి..

**ఎర్రుపాలెం,నవభూమి,జూలై 30 :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చిన వ్యక్తి తిరుగు ప్రయాణంలో బొలెరో వాహన రూపంలో వచ్చిన మృత్యువును తప్పించుకోలేక తిరిగిరాని లోకాలకు చేరిన ఘటన బుధవారం మధ్యాహ్నం జమలాపురం శివారు వెంకటాపురం గ్రామ సమీపంలో జరిగింది. ఎర్రుపాలెం ఎస్సై ఎం రమేష్ కుమార్ తెలిపిన వివరాలు మైలవరం గ్రామానికి చెందిన కంచన శేఖర్(39) తన కుటుంబ సభ్యులతో కలిసి జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని బుధవారం దర్శించుకున్నారు. దర్శనా నంతరం తిరుగు ప్రయాణంలో శేఖర్ తన ద్విచక్ర వాహనంపై మైలవరం వెళ్ళడానికి బయలుదేరాడు. కుటుంబ సభ్యులు ట్రాక్టర్లో వెనుక వస్తున్నారు. శేఖర్ భార్య తన కుమారుడు ఏడుస్తున్నాడని చెప్పడంతో శేఖర్ వెళ్లేవాడువెనకకి తిరిగి వస్తుండగా జమలాపురం ఆలయానికి వచ్చి తిరిగి వెళుతున్న బొలెరో వాహనం ను ఢీకొట్టాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య,కుమారుడు ఉన్నారు. మృతునితండ్రి సుబ్రహ్మణ్యేశ్వర రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# కేంద్ర ప్రభుత్వ పెండింగ్ నోటరీలను వెంటనే బర్తీ చేయాలి: ఐయల్‌పిఏ




**కొత్తగూడెం జులై 30 నవభూమి ప్రతినిధి:** 'కేంద్ర ప్రభుత్వం 2021 లో ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ నోటరీ నోటిఫికేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రం లో దరఖాస్తు చేసియున్న 1900 మంది న్యాయవాదులను వెంటనే నోటరీలు గా నియామకం చేయలని, గత నాలుగు సంవత్సరాలుగా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు అని, కేంద్ర ప్రభుత్వ న్యాయ శాఖ భాధ్యులతో ఈ విషయం పై చర్చించి పెండింగ్ లో ఉన్న నోటరీలను వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, కొత్త నోటరీ నోటిఫికేషన్ విడుదల కు కృషి చేయాలని ఐ.యల్.పి.ఏ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యన్. రాంచంద్రర్ రావు కు ఐ.యల్.పి.ఏ జిల్లా కన్వీనర్ జనపరెడ్డి గోపి కృష్ణ వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్ లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రామచంద్ర రావు కు ఐ.యల్. పి.ఏ జిల్లా కమిటీ కమిటీ కన్వీనర్ జనపరెడ్డి గోపి కృష్ణ, సుంకర భానుప్రియ, మహమ్మద్ సాదిక్ పాషా, యన్. ఉషారాణి, వడ్లకొండ హరి, దేవేంద్ర వర ప్రసాద్, అంకుష్ పాష, వి.రాజేశ్వరరావు, తదితరులు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన రామచంద్రరావు సమస్య పరిష్కారం కోసం తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారని జనపరెడ్డి గోపి కృష్ణ తెలిపారు.

# కస్తూరిబా విద్యాలయంలో వైద్య శిబిరం



**టేకులపల్లి జూలై 30 నవభూమి ప్రతినిధి:** టేకులపల్లిలోని కస్తూర్బా గాంధి విద్యాలయంలో మండల వైద్యాధికారి కందుల దినేష్ నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించి 26 మంది బాలికలకు చికిత్సను అందించడం జరిగింది. ఈ సందర్భంగా బాలికలతో ఏర్పాటుచేసిన సమావేశంలో వ్యక్తిగత పరిశు భ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లో ఒకరి వస్తువులు మరొకరు ఉపయోగించరాదని, ప్రతి ఒక్కరికి రోజు విడిచి రోజు వాడుకోవడానికి విధిగా రెండు టవల్స్, రెండు పిల్లో కవర్స్ ఉండాలని, తడిగా ఉన్న బట్టలు ధరించరాదని, ఎలర్జీ లక్షణాలు ఉన్నపిల్లల బట్టలను డెటాల్ కలిపిన నీటిలో 15 నిమిషాలు ఉంచి, బాగా ఎండిన తర్వాత వాడుకోవాలని సూచించారు. రక్తహీనత వల్ల చురుకుదనం లేకపోవడం, మగతగా ఉండడం, త్వరగా అలసిపోవడం, ఆయాసపడడం, త్వరగా వ్యాధుల బారిన పడటం, చదువు, ఆటల్లో వెనుకబడిపోవడం వంటివి ఉంటాయని, దీనిని నివారించడానికి ఇనుప దాతువు ఉన్న ఆహార పదార్థాలను విరివిగా తీసుకోవడంతోపాటు ప్రతీ గురువారం ప్రతీ బాలికకి ఒక ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్ మింగించాలని వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణా అధికారి దేవా, సూపర్వైజర్ గుజ్జా విజయ, ఏఎన్ఎంలు సులోచన, చంద్రకళ, ప్రిన్సిపల్ సంతు, సీతాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మజహరి, లక్ష్మి పాల్గొన్నారు.

# హెచ్ఎం రవికుమార్‌కు ఘన సన్మానం

- సేవలు ప్రశంసించిన ఉపాధ్యాయ సంఘాల నేతలు
- సాంప్రదాయబద్ధంగా వీడ్కోలు పలికిన విద్యార్థులు



**కామేపల్లి,నవభూమి,జూలై 30 :** కామేపల్లి మండలం గోవింద్రాల పంచాయతీ పరిధిలోని మంగలి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వురిమెళ్ళ రవికుమార్ బాధ్యతాయుతంగా సమర్థవంతంగా విధులు నిర్వహించి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారని గోవింద్రాల కాంప్లెక్స్ హెచ్ఎం బుగ్గినేని నాగేశ్వరరావు, మాజీ కాంప్లెక్స్ హెచ్ఎం జెట్టి రాంబాబు అన్నారు .వురిమెళ్ళ రవికుమార్ ఉద్యోగ విరమణను పురస్కరించుకొని బుధవారం గోవింద్రాల ప్రభు త్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిం చిన సన్మాన మహోత్సవ కార్యక్రమంలో వారు రవికుమార్ -పద్మ దంపతులను ఘనంగా హెచ్ ఎంలు,ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించి వారి సేవలను ప్రశంసించారు.రవికు మార్ సమగ్ర విద్యాభివృద్ధికి, విద్యార్థులకు నా ణ్యమైన బోధన,పాఠశాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో విశేష కృషి చేశారని పేర్కొన్నారు.అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి సమాజంలో గౌరవప్రదమైనదన్నారు.చేసే పనిని బట్టే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుం దన్నారు.రవికుమార్ 27 సంవత్సరాల సర్వీస్ కాలంలో ఎంతోమంది విద్యార్థిని,విద్యార్థులను ఉత్తమ పౌరులు తీర్చిదిద్దారని,వారు ఉద్యోగ పదవీ విరమణ పొందడం విద్యాశాఖకు ఒక తీరని లోటని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయ సంఘాల నాయకులు మందా రాములు, రంగారావు,ఎం.నరసింహారావు,దేవాసింగ్,ఎం. హరీష్, ఎం.నారాయణ, కే.కుమారస్వామి- కృష్ణ వేణి, ఎం.ఆంథోని,గుమ్మడి సమ్మయ్య,గోవింద్రా ల కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ జి.లింగనాయక్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు నాగేశ్వర రావు,తోటమళ్ళ పవన్,సీతారాం,టి.వెంకన్న, సీతారామారావు,సత్యం,నాగయ్య,మాలిక తదితరులు పాల్గొని రవికుమార్ ను ఘనంగా సన్మానించి వారి సేవలను ప్రశంసించడం జరి గింది.

# మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర రైలు సెప్టెంబర్ 9 నుండి ప్రారంభం




**ఖమ్మం, నవభూమి జూలై 29:** గుర్తింపుపొందిన ఇండియన్ రైల్వేస్ , భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు , సౌత్ స్టార్ రైల్ ఈ యాత్ర సెప్టెంబర్ 9వ తేదీ నుండి ప్రారంభమవుతుందని , పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ టూర్ టైమ్స్ డైరెక్టర్ జీ.విఘ్నేష్ తెలిపారు . గూడూరు , నెల్లూరు , ఒంగోలు , చీరాల , గుంటూరు , మిర్యాలగూడ , నల్గొండ , హైదరాబాద్ , కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందన్నారు . ఈ యాత్ర పదిహేను రోజులు జరగనుందన్నారు . ఇండియన్ రైల్వేస్ , భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు , సౌత్ స్టార్ రైలు , భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన అగ్రశ్రేణి టూరిస్ట్ రైలు ఆపరేటర్ 'టూర్ టైమ్స్' ఈ యాత్రకు నడుం బిగించిందన్నారు . ఈ యాత్రలో ఉజ్జయిని , ఓంకారేశ్వర్ , ద్వారకా , సిద్ధ పూర్ , మధుర , అయోధ్య , ప్రయాగ్ రాజ్ , వారణాసి , గయ వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను కవర్ చేయనున్నామని చెప్పారు . గతంలో ఇండియన్ రైల్వేస్ టూర్ టైమ్స్ ప్యాకేజీకు విశేష స్పందన లభించిందన్నారు . ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ , తమిళనాడు రాష్ట్రాల నుంచి 650 మంది యాత్రికులతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు . ఈ సందర్భంగా టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలు , పురాణాల ప్రకారం ఈ యాత్రలో ఉన్న క్షేత్రాలు ఎంతో పేరుగాంచాయన్నారు . ఇవి మానవ శరీరంలోని వివిధ శక్తి కేంద్రాలను సూచిస్తాయని చెప్పారు . అవి.. అయోధ్య (మనస్సు), మధుర (హృదయం), కాశీ (సహస్రార చక్రం), ఉజ్జయిని (నాభి), ద్వారకా (పాదాలు), గయ (పితృ మోక్ష స్థలం), మాతృ గయ (మాతృ మోక్ష స్థలం) అన్నారు . ఈ ప్రత్యేక టూరిస్ట్ రైలు యాత్రికులకు పలు అనుభవాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు . ఈ రైలులో లోపల , బయట దక్షిణ భారత భోజనం అందుబాటులో ఉంటుందన్నారు . లగేజ్ భారం ఉండదన్నారు . దర్శనానికి అవసరమైన బ్యాగ్ మాత్రమే మోయాల్సి ఉంటుందని చెప్పారు . ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు . థర్డ్ ఏసీ (కంఫర్ట్) రూ.45,750, సెకండ్ ఏసీ (డీలక్స్) రూ.54,100, ఫస్ట్ ఏసీ (లగ్జరీ) రూ.69,500 అన్నారు . ఈ యాత్ర టికెట్లను పోన్ 93550 21516 కాల్ చేసి బుక్ చేసుకోవచ్చన్నారు . ఆన్లైన్ బుకింగ్ కోసం %ఃషఃష్.శీబతీఅఎవం.అఅ% సందర్శించవచ్చన్నారు . ఈ సమావేశంలో టూర్ టైమ్స్ మేనేజర్ యాకేశ్ పాల్గొన్నారు . ఆసక్తి గల వారు టికెట్స్ బుక్ చేసుకోండి మరింత సమాచారం కోసం ఈ క్రింది నెంబర్లు సంప్రదించవలసిందిగా 9848343882 , 6303093338 కోరారు

# బనిగండ్లపాడు హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంఈఓ

**ఎర్రుపాలెం, నవభూమి, జులై 30:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం 6 గంటలకు బనిగండ్లపాడు ఎస్సీ బాయ్స్ హాస్టల్ ను ఎంఈఓ మురళీ మోహన్రావు తనిఖీ చేశారు.విద్యార్థులతో మాట్లాడారు.ఆహార పరిశు భ్రత,మెనూ ప్రకారంవంటవండుతున్నారాలేదా,రూము లు,టాయిలెట్స్, డ్రైనేజీలను పరిశీలన చేశారు.విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనం వండిస్తున్నారా లేదా పరిశీలించారు.ఒక గదిలో మాత్రం దోమల మెస్సు రెండు కిటికీలకు లేదు వాటికి మెస్ పెట్టమని వార్డునకు సూచించారు. సాంబార్లో వేసే కూరగాయ ముక్కల్ని చిన్నగా తరిగి వేయాలని,కరేపాకు బాగా వాడాలని,క్యారెట్,బీన్స్,ములక్కాయ ముక్కలుతప్పనిసరిగా సాంబార్లో ఉప యోగించాలని,బియ్యాన్ని బాగా చెరిగి వంట చేయాలని సూచించారు.హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న వసతులు, సేవలు సంతృప్తిని ఇచ్చాయని ఎంఈఓ తెలిపారు.మొత్తం 67మంది విద్యార్థులకు 60 మందివిద్యార్థులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఎస్ రాజేశ్వరరావు,వర్కర్లు రమేష్,శ్రీను తది తరులు ఉన్నారు.



# మౌలానా ఆజాద్ యూనివర్సిటీలో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

## మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అవకాశం

## మైనార్టీ జిల్లా అధ్య క్షులు ఎండీ యాకూబ్ పాషా



**పాల్వంచ జులై 30 నవభూమి ప్రతినిది:** కేంద్ర ప్రభూత్వ పరిధిలోని గల మౌలానా ఆజాద్ యూనివర్సిటీ హైదరాబాద్ వారు అందిస్తున్న ఉచిత సివిల్ సర్వీస్ కోచింగ్ ను సద్విని యోగం చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. కార్పొరేట్ స్థాయికి ధీటుగా జాతీయ స్థాయిలో సివిల్స్ కు ఒక ఏడాది పాటు ఉచిత భోజనం వసతితో పాటు శిక్షణను యూనివర్సిటీ అందిస్తోందని అన్నారు. ఈ శిక్షణ మైనార్టీలతో పాటు ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకు కూడా అందించడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 10 వ తరగతి సర్టిఫికేట్, డిగ్రీ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో ఆగస్టు 5వ తేదీ వరకు తమ వివరాలను https://manuu.gleamappstore.com నందు నమోదు చేసుకోవాలని తేలిపారు. ఈ ఉచిత శిక్షణ పొందేందుకు విశ్వవిద్యాలయం నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని మైనా రిటీ, ఎస్సీ, ఎస్టీ,అన్ని వర్గాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపా రు. ఇతర సమాచారం కొరకు 8520860785 నంబర్ కు సంప్రదించాలన్నారు.

# వెంకటాపురం పాఠశాలలో ఉపాధ్యాయ తల్లిదండ్రుల సమావేశం



**ఎర్రుపాలెం, నవభూమి, జూలై 30:** మండల పరిధిలోని వెంకటపురం ఎంపీపీఎస్ పాఠ శాలలో బుధవారం ఉపాధ్యాయ,తల్లి దండ్రుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తల్లి దండ్రులకు ఈక్రింది విషయాలపై అవ గాహన కల్పించారు.విద్యార్థులు చదవడం రాయడంపై, తరచూ పాఠశాల కు గైరుహాజరవుతున్న విద్యార్థుల్లో పట్ల శ్రద్ధ ఎలా తీసుకోవాలో తెలియజేశారు. ఎఫ్ఏ -1పరీక్షల ఫలితాలపై విశ్లేషణ చేశారు. ప్రతి తరగతిలో ప్రతి సబ్జెక్టులో 20 మార్క్స్ తెచ్చుకున్నవిద్యార్థులకు గిఫ్టులు అందించారు. బ్యాడ్ ఫుడ్,మంచి ఫుడ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఆరో గ్యం పట్ల శ్రద్ధఎలా తీసుకోవాలని తల్లి దండ్రులకు సూచనలుచేశారు.ఈ కార్య క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెల్లంకి నాగరాజు,ఉపాధ్యాయులు రామారావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

# లాఠీ క్రీడలు ఛాంపియన్ షిప్‌లో పటేల్ గూడాకు చెందిన విద్యార్థులు

**పఠాన్ చెరు - నవభూమి ప్రతినిధి-** నేపాల్ ఖాట్మాండులో ఆగష్టు 2 న జరగనున్న ఆసియా సాంప్రదాయ లాఠీ క్రీడలు చాంపియన్ షిప్ లో భారత దేశం తెలంగాణ రాష్ట్రం పటాన్ చేరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపాలిటీ పటేల్ గూడా కు చెందిన విద్యార్థులు ఆడనున్నారు. పటేల్ గూడా లోని ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్ పదో తరగతి విద్యార్థులు శ్రీవల్లి, కృతిక 10వ తరగతి, విద్యార్థి సాన్వి 8వ తరగతి తెలంగాణ లాఠీ క్రీడల చాంపియన్ షిప్ జట్టు తరపున సెలెక్ట్ అయ్యారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అక్బర్ ఖాన్ టీమ్ ఇంచార్జీగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అక్బర్ ఖాన్ మాట్లాడుతూ భారతదేశం నుండి నేపాల్ లో జరగబోయే లాఠీ క్రీడలు చాంపియన్ షిప్ కు వెళ్లడం చాలా సంతోషంగా ఉందని తప్పకుండా మన దేశానికి పథకాన్ని సాధిస్తామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మా పిల్లలు భారతదేశం నుండి నేపాల్ కు వెళ్లి క్రీడ పోటీలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

# ఎలైట్ ఎస్2 ఫార్మా హెూల్‌సేల్- రిటైల్ ఫార్మా అవుట్‌లెట్‌ను ప్రారంభించిన బీఆర్ఎస్ నేతలు

**ఖమ్మంనగరం, నవభూమి, జూలై 30:** ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్ లో ఎలైట్ ఎస్2 ఫార్మా హెూల్‌సేల్-రిటైల్ ఫార్మా అవుట్‌లెట్ ను బుధవారం బీఆర్ఎస్ నేతలు ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్ రావు, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటు ధరలకు నాణ్యమైన మందులు అందించాలని కోరారు. మంచి సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ ఫార్మా డైరెక్టర్ రేగళ్ల కృష్ణ ప్రసాద్ (కెపి) ను అభినందించారు. దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కంపెనీలతో భాగస్వామ్యంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవల కొరకు మందులు అందించడమే తమ లక్ష్యమని రేగళ్ల కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ అవుట్‌లెట్‌లో డిస్కౌంట్ మెడిసిన్స్‌తో పాటు, ఆరోగ్య సంబంధిత పరికరాలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, బిఆర్ఎస్ నాయకులు ముత్యాల వెంకటప్పారావు, కనకమేడల సత్యనారాయణ, బిఆర్ఎస్ వైరా రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, నాయకులు మోతారపు సుధాకర్, మోరంపూడి ప్రసాద్ రావు, బత్తుల శ్రీనివాసరావు, మిక్కిలినేని నరేందర్, గొడ్డేటి మాధవరావు, మరికంటి రేణుబాబు, వాకదాని కోటేశ్వరరావు, ఎదునూరి శ్రీను, బిఆర్ఎస్ యువత భాస్కర్, నాగేశ్వరరావు, షారుక్, ఎలైట్ ఎస్2 ఫార్మా సిబ్బంది ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.










# కొండ తోగు ప్రజల విజ్ఞప్తి మేరకు స్కూల్ ఏర్పాటు

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- విద్య అభివృద్ధికై అహర్నిశలు కష్టపడతాం
- ఐటీడీఏ పిఓ రాహుల్





**అశ్వారావుపేట టౌన్ జూలై 30 నవభూమి:** గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసం అభివృద్ధికై ప్రాథమిక దశ నుండే విద్యార్థులు నిష్ణాతులు అయ్యేలా గిరిజన సంక్షేమ ద్వారా అనేక రకాలైన సంస్కరణలు చేపట్టి గిరిజన విద్యార్థులను వారు అనుకున్నది సాధించే వరకు అహర్నిశలు పాటుపడేలా తోడ్పాటు అందిస్తున్నామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు.

బుధవారం నాడు అశ్వారావు పేట మండలం కొండ తోగు గ్రామంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణతో కలిసి అంగన్వాడి పాఠశాలలో తాత్కాలిక పాఠశాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ గిరిజన పిల్లలందరూ ధనవంతులైన కానీ, మధ్యతరగతి వారైనా కానీ, పేదవారిగా పుట్టిన మంచిగా చదువుకుంటేనే ఖచ్చితమైన ఉన్నత స్థానాన్ని పొందుతారని, చదువుకున్న విలువ అదని, గిరిజనుల పిల్లలను గుర్తించాం కాబట్టి ఐటీడీఏ తరఫున విద్యకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్కూల్స్ లేని చోట స్కూల్స్ కట్టించడానికి ప్రయత్నిస్తున్నామని, స్కూల్స్ ఉన్నచోట టీచర్లు తక్కువ ఉండి పిల్లలు ఎక్కువగా ఉంటే టీచర్లను సర్దుబాటు చేస్తున్నామని, పాఠశాలలకు వచ్చే గిరిజన విద్యార్థులు ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలను అర్థం చేసుకొని చదువుకోవాలని, పాఠాలను బట్టి పట్టి చదువుకునే పద్ధతిని మానుకోవాలని, గిరిజన పిల్లలు నేర్చుకునేది అర్థం చేసుకోవడానికి చిన్నపిల్లలకు ఉద్దీపకం, పెద్దవారికి కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం ఐటీడీఏ పరిధిలో నడుస్తున్న అన్ని పాఠశాలలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కొండతోగు గ్రామంలో దాదాపు 25 మంది గిరిజన పిల్లలు స్కూలుకు వెళ్లి చదువుతున్నట్లు తెలిసిందని, కానీ ఆ పాఠశాల చాలా దూరంగా అడవి మార్గాన నడిచి వెళ్లి వాగు దాటాల్సిన పరిస్థితి ఉందని, వర్షాకాలంలో ఆ వాగు పొంగడం వలన పిల్లలకు ఏదైనా ప్రమాదాలు జరిగే సూచనలు ఉన్నాయని గ్రామస్తులు తెలపడంతో, తెలంగాణ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మరియు స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ తనకు చరవాణి ద్వారా తెలపడంతో కొండతోగు గ్రామములో 23 మంది పిల్లలు ఉన్నందున వారికి విద్య వారి ఊరిలోనే ఇవ్వాలనే ఉద్దేశంతో తాత్కాలికంగా అంగన్వాడీ బిల్డింగులు ప్రారంభిస్తున్నామని, దానికి ఏమైనా చిన్న చిన్న మరమత్తులో ఉంటే త్వరితగతిన చేయిస్తామని అన్నారు. అనంతరం అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ కొండతోగు గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఈ గ్రామంలోని చిన్నారులు అడవి మార్గాన వాగు దాటి ఎంపీపీ పాఠశాలలో చదువుతున్నారని నా దృష్టికి రావడంతో ఐటీడీఏ పీవోను సంప్రదించడం జరిగిందని, కొత్త బిల్డింగ్ కట్టే వరకు ప్రస్తుతం ఈ పాఠశాలను అంగన్వాడీ సెంటర్లో ఏర్పాటు చేశామని పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా మీ పిల్లలను ఈ పాఠశాలలకు పంపి బాగా చదివించుకొని వృద్ధిలోకి తెచ్చుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు ఉద్దీపకం వర్క్ బుక్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఏ సి ఎం ఓ రమేష్, ఏ టి డి ఓ చంద్రమోహన్ మరియు గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక ధర్మ స్థలంలో జరిగే అత్యాచారాలను ఖండించండి

### పిఓడబ్ల్యు రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు చంద్ర అరుణ, పివైఎల్ రాష్ట్ర నాయకులు పూనెం మంగయ్య



**గుండాల జులై 30 నవభూమి:** కర్ణాటక రాష్ట్రం ధర్మస్థలం టెంపుల్ కు పోయిన భక్తులను గత 25 సంవత్సరాల నుండి 2025 వరకు 200 నుండి 300 వరకు మహిళలపై అత్యాచారంకు పాల్పడి హత్య చేయడం ఆ ధర్మస్థలంలో మైనర్ బాలికలను చూడకుండా నగ్నంగా రేప్ చేసి అత్యాచారం కు పాల్పడి బట్టలిప్పి హత్య చేసి యాసిడ్ ముఖం మీద పోసి గుర్తు తెలియకుండా చేసి ఆ ధర్మ స్థలంలో శవాలను పడేసి వెళ్లిపోతే అక్కడ ఉన్నటువంటి మున్సిపాలిటీ కార్మికుడు వందలాది శవాలను భూమిలో పాతిపెట్టి ఇవాల్టికి బయటికి వచ్చిన విషయం చూస్తా ఉన్నాం. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి ధర్మస్థలం లో ఏం జరుగుతుందో పాడిశుద్ధ్య కార్మికుడు చెప్పిన వాస్తవాలను అలాగే ధర్మస్థలం టెంపుల్ లో మహిళలపై అత్యాచారానికి మానభంగానికి పాల్పడి యాసిడ్ డీజిల్ పెట్రోల్ పోసి మనుషులను మహిళలను చిన్నారులను గుర్తు తెలవకుండా ఆ ఘటానికి అత్యాచారానికి పాల్పడ్డ నిందితులను న్యాయ విచారణ జరిపి ఎలెక్కి తీయాలని, ప్రగతిశీల యువజన( పి పి వై ఎల్ ) ప్రగతిశీల మహిళా సంఘం(పి ఓ డబ్లు) డిమాండ్ డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పి వై ఎల్ డివిజన్ కార్యదర్శి సనపగ కుమార్, పి వై ఎల్ మండల అధ్యక్షులు వుకే శ్రావణ్, ఈసం ప్రభాకర్ కుంజ నరేష్ పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వై సావిత్రి ముత్తక్క బానోత్ అరుణ ఈసం విజయ

## పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం క్రైం, నవభూమి జూలై 30:** నగరంలోని ప్రకాష్ నగర్ లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పనితీరు పరిశీలించారు.రోడ్ల మరమ్మత్తులు, వర్షాలతో దెబ్బతిన్న సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. నేరాల నియంత్రణలో కీలకంగా పనిచేస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటు పై పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

## ఇంధన శాఖపై జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో ప్రారంభమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి జూలై 30:** హాజరైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎండీ హరీష్, సీఎండీ ముషారఫ్, సీఎండీ వరుణ్ రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, అనిల, ఇతర ఉన్నతాధికారులు

## విద్యా శిఖరం శేషన్నకు ఇల్లెందులో ఘనంగా నివాళులు

- బడ్జెట్ ప్రైవేటు స్కూల్స్‌లో శేషు కుమార్ సేవలు అమోఘం
- వ్యాస రచన పోటీ విజేతలకు బహుమతుల అందజేత



**ఇల్లెందు జులై 30 నవభూమి ప్రతినిధి:** మూడు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో ఒక విద్యా శిఖరం నేలకొరికింది, అయినా ఆ విద్యా శిఖరం సేవలు ఇప్పటికీ అనేక మందికి ఉపయోగ పడుతున్నాయని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సూరపనేని శేషు కుమార్ గత 3 సంవత్సరాల క్రితం గుండె పోటుతో మరణించారు. ఆయన మూడో వర్ధంతి సభ బుధవారం ఇల్లెందు ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ఎంఇఓ ఉమా శంకర్, టిపిజెఎంఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం వీరారెడ్డి, ట్రస్మా ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుర్రం కాంతారావు లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పోరేట్ విద్యా సంస్థలకు ధీటుగా బడ్జెట్ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తూ సేవా దృక్పథంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇదే సందర్భంలో బడ్జెట్ పాఠశాలలకు ఏమైనా సమస్యలు ఉంటే శేషు కుమార్ ఎంతో నేర్పుతో ఆ సమస్యలను పరిష్కరించేవాడని ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇల్లెందు పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శేషు కుమార్ స్మారకార్థం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు ఈ సందర్భంగా బహుమతులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ట్రస్మా రాష్ట్ర నాయకులు తుమ్మలపల్లి ప్రసాద్, నామా సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు కె వెంకటస్వామి, మార్గదర్శిని హైస్కూల్ డైరెక్టర్స్ యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ, మాస్టర్ మైండ్ హైస్కూల్ కరస్పాండెంట్ సర్వేశ్వరరావు, కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ డి. రాంచందర్, ఎం ఆర్ జి నారాయణ హైస్కూల్ కరస్పాండెంట్ ఒంగూరి శ్రీను, భారత్ స్కూల్ కరస్పాండెంట్ మోహన్ రావు, స్వాతి స్కూల్ కరస్పాండెంట్ రామకృష్ణ, అరుణోదయ సుధాకర్ పాల్గొన్నారు









## జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**పాల్వంచ జులై 30 నవభూమి ప్రతినిది:** పాల్వంచ మండల పరిధి లోని జగన్నాధపురం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు ఓపీ, రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్‌పేషెంట్ వార్డు, వ్యాక్సినేషన్ గదులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇతర సిబ్బంది హాజరును పరిశీలించి, విధి నిర్వహణ పట్ల అలసత్వం ప్రదర్శించకుండా ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను పర్యవేక్షిస్తూ, వారికి అందుబాటులో ఉన్న మందుల గురించి తెలుసుకున్నారు. రోగులతో ప్రత్యక్షంగా మట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా...? మందులు ఇస్తున్నారా...? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పట్ల అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది సమయ పాలన పాటిస్తూ



విధుల్లో నిబద్ధత చూపాలని ఆదేశించారు. అన్ని రకాల అవసరమైన మందులు, వ్యాక్సిన్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా స్టాక్ పూర్తయ్యేలోపే ముందుగానే ఇండెంట్ చేసి తెప్పించుకోవాలని సూచించారు. ఎక్స్‌పైర్ అయ్యే ఔషధాలపై అప్రమత్తంగా ఉండాలని, అవి ఆసుపత్రిలో నిల్వ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, వైరల్ ఫీవర్ల చికిత్సకు అవసరమైన మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. గర్భిణీల వివరాలు నిబంధనల ప్రకారం ఆన్లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట డాక్టర్ రాజు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో పర్యటించిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు: ఘనంగా స్వాగతం పలికిన పోనిశెట్టి



**పాల్వంచ జులై 30 నవభూమి ప్రతినిది:** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం తొలి సారి పాల్వంచలో పర్యటించిన ఎన్. రాంచంద్రరావుకు బుధవారం పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతించారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు పూలమాలలతో హర్షధ్వానాలతో రాంచంద్రరావు ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు మాట్లాడుతూ... రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రాష్ట్రంలో బీజేపీని బలమైన ప్రత్యామ్నాయంగా నిలిపేందుకు రాంచంద్రరావు నాయకత్వం కీలకమవుతుందన్నారు. పాల్వంచ ప్రజలు పార్టీ కార్యకర్తల్లో ఈ పర్యటనతో కొత్త ఉత్సాహం నెలకొంది.

## హెూంగార్డుకు రూ.15 లక్షల బీమా చెక్కు అందజేత



**ఖమ్మం క్రైం, నవభూమి, జూలై 30:** గత ఏడాది నవంబర్ లో విధులకు వెళు తున్న ఖమ్మం యూనిట్ కు చెందిన హెూంగార్డు బాణాల రామచారి కి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయాడు..ఈ నేపథ్యంలో యాక్సెస్ బ్యాంక్ సాలరీ అకౌంట్‌తో వచ్చే ప్రయోజనాలు, ప్రమాద బీమా సొమ్ము రూ. 15 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా హెూంగార్డు కు అందజేశారు. కాలు కోల్పోయి ఇంటి వద్దనే ఉంటున్న హెూంగార్డుకు పోలీస్ కమిషనర్ సూచనలతో వైరా ఎస్ఐ రామారావు చొరవ తీసుకుని విజయవాడకు చెందిన స్వచ్ఛంద సేవకుడు, రిటైర్డ్ విద్యుత్ శాఖ ఉద్యోగి శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో ఇటీవల అదునాతన కృత్రిమ కాలు అందించడం జరిగిందాన్నారు.ఈ సందర్భంగా వారిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, హెూమ్ గార్డ్ ఆర్ఐ సురేష్, వైరా ఎస్ఐ రామారావు , హెూంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంక శ్రీను, సి సి వెంకటేశ్వర్లు, డి రవిబాబు, సిహెచ్ నాగరాజు, డి రమేష్, రహీమ్, జి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పార్కులను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు

**- జూబ్లీ ఎంక్లేవ్ పార్కులను సంరక్షిస్తాం**

**- కబ్జాదారులను హెచ్చరించిన ఎమ్మెల్యే గాంధీ**

**శేరిలింగంపల్లి ప్రతినిధి-నవభూమి, జూలై 30:** పార్కులను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని, ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హెచ్చరించారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని జూబ్లీ ఎంక్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి కబ్జాదారుల నుండి పార్కులను కాపాడాలని వినతిపత్రం ఇచ్చారు. మూడు పార్కులను, రోడ్లను కొందరు వ్యక్తులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులకు విన్నవించుకున్నా ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

# హామీలను అమలు చేయడం కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**గార్ల, నవభూమి, జులై 30:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా మన్ననలను పొందిన ప్రజా ప్రభుత్వమని ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యుడు కోరం కనకయ్య అన్నారు. గార్ల మండలం పరిధిలోని ఇరవై గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇందిరమ్మ గృహా సముదాయాలకు బుధవారం శంకుస్థాపనలు చెయడం తో పాటు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గార్ల గ్రామం వెలుపల ఉన్న ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కల నెరవేర్చాలని సదుద్దేశంతో ఇందిరమ్మ పేరుతో గృహాలు మంజూరు చేసి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఘనత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం దేనన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీ లతో పాటు రైతులకు రుణాల మాఫీ, బోనస్ అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అవకాశవాద విధానాలు నియంతృత్వ చర్యలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన గత ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రయోజన పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక



సంస్థల ఎన్నికల్లో సంపూర్ణ సహకారాన్ని అందించాలని కనకయ్య కోరారు. ఈ కార్యక్రమంలో గార్ల సొసైటీ అధ్యక్షుడు వడ్డముడి దుర్గాప్రసాద్, ఇల్లందు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాంబాబు, గార్ల సొసైటీ డైరెక్టర్ శీలం శెట్టి ప్రవీణ్ కుమార్, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్య అశోక్, గార్ల తాసిల్దార్ శారద, ఎంపీడీవో మంగమ్మ మండల వ్యవసాయ శాఖ అధికారి రామారావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ మండల తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# మణుగూరులో అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్‌శర్మ పర్యటన

**మణుగూరు జులై 30 నవభూమి ప్రతినిధి:** మణుగూరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూపీఎస్సీ సీఎస్ఈ 2023లో ఆల్ ఇండియా ర్యాంక్ 23 సాధించిన సౌరభ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ (శిక్షణలో) బుధవారం మండలాన్ని సందర్శించారు. ఆయన తన జిల్లా శిక్షణలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం, భవిత సెంటర్, రైతు వేదిక గుట్ట మల్లారం, ఐకేపీ కార్యక్రమం, పగిడేరు జియోథర్మల్ ప్రాజెక్ట్‌లను పరిశీలించారు. ఈ సందర్శనలో సౌరభ్ శర్మ మండల పరిషత్ విధులను సమీక్షించారు. రెవెన్యూ, వ్యవసాయం, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విద్య, గిరిజన సంక్షేమం, ఎస్సీ అభివృద్ధి, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, ప్లానింగ్, , అటవీ, పరిశ్రమలు, రవాణా వంటి అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సంభాషించారు. ఆయన వివిధ శాఖల కార్యక్రమాలు, పథకాల అమలు తీరును అధ్యయనం చేశారు. మండల పరిషత్ అధికారి మండల రెవెన్యూ అధికారి సమన్వయంతో ఈ సందర్శన జరిగింది. సౌరభ్ శర్మ సందర్శన మణుగూరు మండల యంత్రాంగం పనితీరును మెరుగుపరచడానికి, పారదర్శకతను పెంపొందించడానికి దోహదపడుతుందని భావిస్తున్నాము.









# రామవరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ బీసీ సెల్ నాయకులు సత్యారాజ్ మృతి

**■ తీవ్ర విచారం వ్యక్తం చేసిన కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్**

**రుద్రంపూర్ జులై 29 నవభూమి:** రామవరం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు సత్యరాజ్ మృతి చెందడం చాలా బాధాకరం అని ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ తెలియజేసినారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ లో నీతి నిజాయితీ క్రమశిక్షణ కలిగిన నాయకుడు అని ఒక సామాన్య కార్యకర్త నుంచి బీసీ సెల్ జిల్లా నాయకుడిగా ఎదిగిన సత్యరాజ్ గారు అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాల లో పాల్గొనేవారనివారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని కోరుతూ ఘన నివాళులు అర్పిస్తు, వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మల్లారపు కొమరయ్య, గుడివాడ రాము జెట్టి మోహన్, అచ్చ నాగరాజు, జానీ పాషా, పవన్, నజీర్, వనం దాస్ గద్ద మోహన్, నాగరాజు, బోధస్ కనకరాజు, చారి,



భాను కమల్, నాగేశ్వరరావు, పాషా, రమేష్, శ్రీనివాస్ తదితర రామవరం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రిలియంట్ గ్రామర్ స్కూల్



**రుద్రంపూర్ జూలై 30 నవభూమి:** జూన్ 15న రోజున శరత్ మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ ఖమ్మం మరియు యశోద హాస్పిటల్ హైదరాబాద్ వారు మెగా ఉచిత వైద్య శిబిరము నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్ లో 200 లకు పైగా పేదవారు ఉచిత సేవలను పొందారు. దానిలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకోన్న వారిలో ఏడుగురికి ఉచిత కంటి ఆపరేషన్ చేయించడం గర్వించదగ్గ విషయం. 30 జులై 2025 రోజున కంటి ఆపరేషన్ పొందిన పేదవారు బుదరావుపేట బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ ఆవరణలో స్కూల్ యాజమాన్యానికి మరియు రాజ్ మహమ్మద్ జాన్ బి మెమెరీరియల్ ట్రస్ట్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**రుద్రంపూర్ జూలై 29 నవభూమి:** కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో ఉన్న గౌరవ మంత్రి పొంగులేటి శ్రీనన్న క్యాంపు కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి ద్వారా మంజూరు చేయబడిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 18 వార్డ్ కాంగ్రెస్ ఇంచార్జి దొడ్డి హైమావతి లబ్ధి దారుడు బండి శివ కి చెక్కు అందచేయడం జరిగింది

# రిజర్వ్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం క్రైం, నవభూమి, జూలై 30:** పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో అధునీకరించిన సిటీ ఆర్మడ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ (ఆడ్మిన్, యంటివో) కార్యాలయాలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. రిజర్వ్ ఇన్స్పెక్టర్ కార్యాలయం విధులు సజావుగా, సౌకర్యవంతంగా నిర్వహించేలా ఫర్నీచర్ , తదితర ఏర్పాట్లు చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి కుమారస్వామి, ఏఆర్ ఏసిపిలు సుశీల్ సింగ్, నర్సయ్య, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగులమీరా, పాల్గొన్నారు.

# రజబ్ ఆలీ నగర్‌ను సందర్శించిన మండల విద్యాశాఖాధికారి ఆనంద్ కుమార్





**అన్నపురెడ్డిపల్లి జులై 30 నవభూమి:** మండలంలో మహబూబ్ నగర్ గ్రామ సమీపములో అడవుల మధ్య లో ఉన్న రజబ్ ఆలీ నగర్ ను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్, సెంటర్ ఫర్ ఫౌండేషన్ టీం సమగ్రశిక్ష జిల్లా టెక్నికల్ టీమ్ సభ్యులు కార్తీక్, ఉపాధ్యాయులు కృష్ణ, బుచ్చయ్య ల సహకారంతో సందర్శించారు. ఈ గోత్తికోయ ఆవాసం నుండి మహబూబ్ నగర్ ప్రాథమిక పాఠశాలకు 11 మంది విద్యార్థులు వస్తారుమహబూబ్ నగర్ ప్రాథమిక పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరములో ఉన్న ఈ ప్రాంతం నుండి రోజు ఉపాధ్యాయులు కృష్ణ, బుచ్చయ్య ముందుగానే వెళ్ళి తీసుకొచ్చి, పాఠశాల అనంతరం తిరిగి వారి ప్రాంతానికి చేరుస్తారని మండల విద్యాశాఖాధికారి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల చదువు కోసం ఇంతగా కష్టపడుతున్నారని, అందుకు కృష్ణ, బుచ్చయ్య లు ఉదాహరణ అని, వారిని అభినందించారు.

కొద్దిసేపు గ్రామస్థులతో మాట్లాడి వారి పిల్లలను బడికి పంపాలి, చదువుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపకూడదని హితవు పలికారు వారి కి రవాణా సౌకర్యం కలిగించేందుకు విద్యాశాఖ అధికారులతో మాట్లాడతానని తెలిపారు.

గిరిజనుల్లో విద్యను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజబ్ ఆలీ నగర్ వాస్తవ్యులు మేసా, చెన్న, గంగ పాల్గొన్నారు.

# రెవిన్యూ శాఖ స్థలం కేటాయిస్తే సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తాము

- ఇటీవలే తాసిల్దారుకి వినతి పత్రం అందజేత
- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించటమే లక్ష్యం
- విద్యుత్ శాఖ ఏడి





**బూర్గంపాడు జులై 30 నవభూమి:** నాగినేని ప్రోలు, రెడ్డిపాలెం రెవిన్యూ గ్రామాల పరిధిలోని రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలంటే రెవెన్యూ శాఖ ప్రభుత్వ స్థలం అందిస్తే సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని విద్యుత్ శాఖ డి ఈ జీవన్ కుమార్ అన్నారు. నాగినేని ప్రోలు రెడ్డిపాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో అయిన రెడ్డిపాలెం, ముసలిమడుగు, రామాపురం ప్రాంతాలలో ఉన్న పంట పొలాల రైతులతో డి ఈ జీవన్ కుమార్ సారపాక ఏ ఈ తో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. రైతులు పడే ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అంతరాయం లేకుండా అందించేందుకు సుమారు రెండున్నర కోట్ల వ్యయంతో సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సబ్ స్టేషన్ వలన కృష్ణసాగర్, బత్తుల నగర్ గ్రామాలకు కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. తాసిల్దార్ కు ఇటీవల సారపాక ఏఈ వినతిపత్రం అందించారు. ప్రభుత్వ స్థలం చూపించిన వెంటనే సబ్టేషన్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఈ జీవన్ కుమార్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వేణు,

ఏ ఈ ఉపేందర్ లైన్మెన్ ప్రసాద్, నాగిని ఎన్ని ప్రోలో రెడ్డిపాలెం రైతులు ముసలమడుగు రైతులు పాల్గొన్నారు.

# ప్లాంటేషన్ పోడుకు వెళ్తున్న జేసీబీల అడ్డగింత

- ఎఫ్‌డీవో హామీతో అందోళన విరమణ



**కారేపల్లి,నవభూమి, జూలై 30:** ప్లాంటేషన్ పోడులో ఫారెస్టు అధికారులు పనులు ప్రారంభించారు. ప్లాంటేషన్ పోడుపై పోడుదారులు, ఫారెస్టు మధ్య వివాదం సాగుతూ ఉద్రిక్తలకు దారితీసి కేసుపెట్టుకునే వరకు వచ్చింది. ఈక్రమంలో ఫారెస్టు అధికారులు వివాదస్పద ప్లాంటేషన్ పోడులో మంగళవారం నుండి పనులు ప్రారంభించారు. ఖమ్మం రూరల్ ఏసీపీ పరిధిలోని పోలీస్ సిబ్బంది సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు మధ్య ఫారెస్టు అధికారులు బుధవారం కూడా పనులు చేయటానికి జేసీబీలతో ప్లాంటేషన్ పోడుకు వెళ్తుండగా పోడుదారులు అడ్డుకున్నారు. జేసీబీలను అడ్డుకోని తమకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ప్లాంటేషన్‌లో పనులు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు, పారెస్టు అధికారులు, పోడుదారులతో మాట్లాడారు. పోడుపై హక్కులు తెచ్చుకుంటే మీ జోలికి రామన్నారు. ప్లాంటేషన్ వేయాలనే లక్ష్యం కోసం ప్రత్యామ్నాయం పోడు చూపుతామని మభ్యపుచ్చి మా జీవితాలు ఆగం చేయాలని చూస్తున్నారని పోడుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో మాట్లాడి పట్టాలు తేచ్చుకోవాలని తమ విధులకు ఆటంకం కల్పించవద్దని అధికారులు సూచించారు. ప్లాంటేషన్ వేయటానికి ప్రత్యామ్నాయ పోడు చూపుతామని ఫారెస్టు అధికారులే హామీ ఇచ్చారని, ఇప్పుడు ప్రభుత్వం ద్వారా హక్కు తెచ్చుకోవాలని చెప్పటం ఎంతవరకు సమంజసమన్నారు. కేసులు పెట్టి నిర్భందాలు పెట్టిన మా పోడుదక్కేవరకు పోరాటం ఆగేదిలేదని తేగేసి చెప్పారు. లిఖమ్మంలో చర్చిద్దాం రండి, ఎఫ్‌డీవో వెంకన్ననాయక్‌ప్లాంటేషన్ పనులకు అడ్డుచెప్పవద్దని ప్లాంటేషన్ పోడుదారుల సమస్యలపై ఖమ్మం ఫారెస్టు కార్యాలయంలో చర్చిద్దామని ఎఫ్‌డీవో వెంకన్ననాయక్ అన్నారు. పోడుదారులతో మాట్లాడిన ఆయన జేసీబీలను వదిలివేయాలని రెండురోజుల తర్వాత సమస్యలపై చర్చిద్దామని చెప్పటంతో పోడుదారులు అందోళన విరమించారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం



(1వ పేజీ తరువాయి) కొత్త రేషన్ కార్డు వచ్చిన ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని అన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా పాలేరు నియోజకవర్గంలో అమలవుతున్నాయని అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ట్రస్టు ద్వారా మంత్రి సైకిళ్లను పంపిణీ చేశారని తెలిపారు. నూతన రేషన్ కార్డు లబ్ధిదారులు పేద కుటుంబాలకు నూతనంగా రేషన్ కార్డులు అందిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి నేలకొండపల్లి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చెరువు మాదారం గ్రామంలో 88.5 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, బోదులబండ గ్రామంలో 15 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, మండ్రాజుపల్లి గ్రామంలో మండ్రాజుపల్లి నుండి కోరట్లగూడెం వరకు 2 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న బి.టి.రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఆర్డీఓ నరసింహా రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎర్రయ్య, నేలకొండపల్లి మార్కెట్ కమిటి చైర్మన్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.పరంజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు, పాల్గొన్నారు

# దేవాలయాల్లో వరుస దొంగతనాలు

### ఛేదించిన చందానగర్ పోలీసులు

### ముగ్గురు దొంగల ముఠా అరెస్ట్

**శేరిలింగంపల్లి ప్రతినిధి-నవభూమి, జూలై 30:** దేవాలయాల్లో వరుస దొంగతనాల కేసును చందానగర్ పోలీసులు ఛేదించారు. ముగ్గురు దొంగల ముఠాను పట్టుకుని బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారం హనుమాన్ దేవాలయంలో గతంలో దొంగతనం జరిగింది. వారం క్రితం హుడా కాలనీలోని సాయిబాబా ఆలయం, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివాలయంలో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన చందానగర్ పోలీసులు మియాపూర్ ఏసీపీ సిహెచ్.వై.శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో చందానగర్ ఇన్స్పెక్టర్ ఎస్.విజయ్, డిఐ భాస్కర్ ఆధ్వర్యంలో డిఎస్ఐ ఎం.నరసింహ్మా రెడ్డి, క్రైమ్ సిబ్బంది నాలుగైదు రోజులు రాత్రింబవళ్లు ముమ్మరంగా గాలించారు. హుడా కాలనీ సాయిబాబా గుడి వద్ద నుండి వరుసగా వందలాది సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించి, వాటి అధారంగా గాజులరామారంలోని రోడామేస్త్రి నగర్ కు చెందిన మహమ్మద్ అన్వర్, శుభమ్ సింగ్, ధర్మేష్ కున్వర్ చోరీలకు పాల్పడ్డట్టు గుర్తించారు. దొంగల ముఠాను అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు ఆలయాల్లో ఎత్తుకెళ్లిన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దేవాలయాల్లో దొంగతనాలు చేయడానికి దొంగలు ఉపయోగించిన ఒక బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం రిమాండుకు పంపించారు. ఈ వరుస దొంగతనాల కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన చందానగర్ పోలీసులను సైబరాబాద్ కమీషనరేట్ ఉన్నతాధికారులు అభినందించారు.

# ఫీల్డ్ అసిటెంట్ల మధ్య వ్యత్యాసం లేకుండా, అందరికి ఒకే జీతం ఇవ్వాలని మంత్రి సీతక్క ఆదేశాలు

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి జూలై 30:** ఫీల్డ్ అసిటెంట్లకు గ్రూప్ ఇస్యూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తామని మంత్రి సీతక్క హామీ సర్క్యులర్ 4779 రద్దు, గతంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి తీసుకునేలా సాధ్య సాధ్యాలను పరిశీలించాలని ఆదేశాలు జీతాల పెంపు, గా పరిగణించాలి

# పెన్షనర్ల బకాయిలను తక్షణం చెల్లించండి

- ఖమ్మంలో ఎస్జిపిఏటి ఆధ్వర్యంలో ప్రదర్శన,
- అంబేడ్కర్ విగ్రహానికి వినతి




**ఖమ్మం, నవభూమి జూలై 30:** ఏడాదిన్నర కాలంగా పెండింగ్ లో ఉన్న పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జీపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇదే రీతి తాత్సారం చేస్తే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి బకాయిల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) ఆధ్వర్యంలో స్థానిక కృషి భవన్ నుంచి జెడ్పి సమీపంలోని అంబేడ్కర్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పరిశ పుల్లయ్య మాట్లాడుతూ 2024 ఏప్రిల్లో ఉద్యోగ విరమణ చేసిన వారికి సైతం బకాయిలు చెల్లించ లేదని వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారని ఒక ఖమ్మం జిల్లాలోనే రెండు వేల మంది పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. గతంలో ఉద్యోగ విరమణ పొందిన వెంటనే ఉద్యోగికి రావాల్సిన బకాయిలను సత్వరం చెల్లించారని ఆయన గుర్తు చేశారు. పెన్షనర్లకు ఈహెచ్ఎస్ ద్వారా నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, గ్రంథాలయ, మార్కెటింగ్ శాఖలోని ఉద్యోగులకు కూడా ట్రెజరీ ద్వారా పెన్షన్లు చెల్లింపు పద్దతిని ప్రవేశ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 20 సంవత్సరాల ఉద్యోగ జీవితం పూర్తి చేసిన వారికి పూర్తి పెన్షన్ చెల్లింపు విధానాన్ని అమలు చేయాలని ఖమ్మం ఎస్టివోను పెన్షనర్ల ఇబ్బందుల దృష్ట్యా జెడ్పి కార్యాలయంకు మార్చాలని పుల్లయ్య డిమాండ్ చేశారు. డిఆర్ బకాయిలు ఏక మొత్తంగా చెల్లించాలని పిఆర్సిపై సత్వరం ప్రకటన చేయాలని నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పెన్షనర్లకు ఆర్టిసిలో 50 శాతం రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, కోశాధికారి కనపర్తి వెంకటేశ్వర్లు, సంఘ బాధ్యులు ఐవి భాస్కరాచారి, వి. మనోహర్రాజు, మేరీ ఏసుపాదం, శరత్ బాబు, తాడి అంజలి, జి. -లక్ష్మి సుజాత, అన్నమ్మ, ప్రసాదరావు, రాంకోటారెడ్డి, నాగప్రసాద్, కిషన్ రావు, జెల్లా వెంకటేశ్వర్లు, కంచుమర్తి పుల్లయ్య, రవీందర్, కృష్ణయ్య, గుర్రాల శ్రీనివాసరావు, రామనాథం, నర్సయ్య, కోట్యా తదితరులు పాల్గొన్నారు.

# ఎండీఆర్ ఫౌండేషన్‌కు మరో అవార్డు

**పఠాన్ చెరు - నవభూమి ప్రతినిధి-** పఠాన్ చెరు నియోజకవర్గం పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్‌కు మరో అవార్డు దక్కింది. హైదరాబాద్ బాచుపల్లి ఎస్వీఎం గ్రాండ్ హోటల్లో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేమ్ చేంజర్ అవార్డు 2025 కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ కు గేమ్ చేంజర్ అవార్డు ను ప్రధానం చెసి గౌరవించారు. ఈ కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మధు సుధన్ సంస్థ తరఫున అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మాదిరి దేవేందర్ రాజు ప్రోత్సాహం మరియు కో-ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ సహకారంతో ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ఫౌండేషన్ చేపట్టిన ముఖ్యమైన సేవలలో గుర్తు తెలియని మృతదేహాల దహన కార్యక్రమాలు, ఉచిత ఆరోగ్య శిబిరాలు, ఆర్థికంగా బలహీనులైన విద్యార్థులకు విద్యా సహాయం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, అలాగే ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక, నిత్యావసర సరుకులు మరియు మానసిక మద్దతు వంటి సేవలు ఉన్నాయి. ఈ అవార్డు మా సేవా కార్యక్రమాల పట్ల సమాజం చూపిన అంగీకారానికి నిదర్శనం. ఇది మా బాధ్యతను మరింత పెంచింది. రాబోయే




రోజుల్లో మరిన్ని ప్రజాపయోగ సేవలతో ముందుకు సాగుతాం.

# సీగాచి పరిశ్రమలో మరణించిన వ్యక్తులకు నివాళులు అర్పించిన బిఆర్ఎస్ నాయకులు

**పఠాన్ చెరు - నవభూమి ప్రతినిధి-** సీగాచి పరిశ్రమలో మరణించిన వ్యక్తులకు బిఆర్ఎస్ నాయకులు నివాళులు అర్పించారు. పాశమైలారం సిగాచి పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించి 30 రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు మాజీ జెడ్పిటిసి గడీల శ్రీకాంత్ గౌడ్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ లు కొవ్వొత్తులతో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశమైలారం పరిశ్రామిక వాడలో అత్యంత విషాదం ఈ దుర్ఘటన అని తెలిపారు. ఒక అగ్ని ప్రమాదంలో 54 మంది మరణించడం పెద్ద సంఘటన అని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మరణించిన కార్మికులు పరిశ్రమ స్టాప్ కు నివాళు లర్పిస్తున్నామని వారి ఆత్మకు శాంతి చేకూరాలని తామంతా ప్రార్థిస్తున్నామని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నాయి. నెలరోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఇస్తామన్నా కోటి రూపాయలు పరిశ్రమ కానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ ఇవ్వకపోవడం విచారకరమని



వారు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సీఎం కేసీఆర్,మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రి కేటీఆర్ల స్ఫూర్తితో పోరాడుతుందని అన్యాయానికి గురవుతున్న బాధిత కుటుంబాలకు అండగా నిలిచి నష్టపరిహారం చెల్లించేలా పోరాడతామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నాయకులు మేరాజ్ ఖాన్,మాణిక్ యాదవ్, రామకృష్ణ ముదిరాజ్,మొబైల్ అసోసియేషన్ సభ్యులు నరేందర్ రెడ్డి, అహ్మద్,భూపాల్,నర్సోతం రెడ్డి, దీపక్, ఎస్ ఆర్ కె యువసేన సభ్యులు ధన్ రాజ్, షకీల్, సల్మాన్,సాయి కుమార్,దుర్గా సాయి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.